ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## శ్రీలంక కొత్త అధ్యక్షుడిగా అనుర కుమార దిసనాయకే

ఎన్నికల్లో ఘన విజయం

2లో..

సంపుటి: 2 సంచిక: 165 పేజీలు: 4 వెల: రూ.3/- సోమవారం 23 సెప్టెంబర్ 2024 ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# ఎమ్మెల్యేలకు సీఎం వార్నింగ్

### సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి






హైదరాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పార్టీలోని పలువురు ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు. జాగ్రత్తగా మెలగాలని వారికి సీఎం రేవంత్‌రెడ్డి హితవు పలికారు. ప్రతి ఎమ్మెల్యే సాయంత్రం 4.00 గంటల నుంచి 6.00 గంటల వరకు నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు సమయం కేటాయించాలని పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు. బీసీ జనగణన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్నారు. త్వరలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్డు ఆధారంగానే ఆ ఫ్యామిలీకి సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పుకొట్టే విధంగా సన్నద్ధంగా ఉండాలని పార్టీ ఎమ్మెల్యేకు ..మిగతా 2లో




## బైడెన్‌తో చర్చలు ఫలించాయి

### క్వాడ్ ఎవరికీ వ్యతిరేకం కాదు: ప్రధాని మోదీ

న్యూయార్క్: సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం): క్వాడ్ ఎవరికీ వ్యతిరేకం కాదనీ, ఇది అంతర్జాతీయ భద్రత, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ అన్నారు. దక్షిణ, తూర్పు చైనా సముద్రంలో వివాదాలలో నిమగ్నమై ఉన్న చైనాపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. అమెరికాలోని డెలావేర్‌లో జరుగుతున్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచాన్ని ఉద్రిక్తతలు, సంఘర్షణలు చుట్టుముట్టిన సమయంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. అలాంటి పరిస్థితిలో భాగస్వామ్య ప్రజాస్వామ్య విలువల ఆధారంగదా క్వాడ్‌తో కలిసి పని చేయడం మొత్తం మానవాళికి చాలా ముఖ్యమని చెప్పారు. 2021లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అధ్యక్షతన ..మిగతా 2లో

## ఆదివారమూ ఆగని హైడ్రా

### కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేత



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం): అక్రమ నిర్మాణాలపై నాన్‌స్టాప్‌గా దూసుకెళ్తోంది హైదరాబాద్ డిసాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ అలియాస్ హైడ్రా. హైదరాబాద్‌లో ఆడా,ఈడా అనే తేడా లేకుండా ఎక్కడ కబ్జా కనిపించినా హై స్పీడుతో కదంతొక్కుతున్న హైడ్రా.. తాజాగా మరోసారి జూలు విదిల్చింది. హైడ్రా ఆదేశాలతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పలు ఏరియాల్లో కూల్చివేతలు చేపట్టారు.

**కూకట్‌పల్లి, అమీన్‌పూర్ ఏరియాల్లో కూల్చివేతలు**

కూకట్‌పల్లి, అమీన్‌పూర్ ఏరియాల్లో కబ్జానిర్మాణాలపై ఫోకస్ పెట్టింది హైడ్రా. కూకట్‌పల్లి నల్లచెరువులోని 66, 67, 68, 69 సర్వే నెంబర్లలో అనుమతులు లేకుండా నిర్మించిన 16 షెడ్లను కూల్చేసింది. ఇప్పటికే ఆయా నిర్మాణాల యజమానులకు నోటీసులు ఇచ్చిన హైడ్రా ఉదయాన్నే బుల్డోజర్స్, ప్రొక్లెయినర్స్‌తో సహా స్పాట్‌కు చేరుకుంది. చెరువును కబ్జా చేసి కట్టిన మొత్తం 16 కమర్షియల్ షెడ్లు, ప్రహరి గోడలను కూల్చివేసింది. కూకట్‌పల్లి నల్లచెరువు పరిధిలో 4 ఎకరాల స్థలాన్ని స్వాధీనం ..మిగతా 2లో


### అమృత్ టెండర్లలో తప్పు జరగలేదని నిరూపిస్తే

## రాజకీయ సన్యాసం చేస్తా

### మంత్రి పొంగులేటికి కేటీఆర్ సవాల్



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం): అమృత్ టెండర్లలో తప్పు జరగలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి సవాల్‌ను స్వీకరిస్తున్నానని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. నిన్న ఒక మంత్రి తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిల్డప్ ఇచ్చారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇద్దరం కలిసి హైకోర్టు సీజే దగ్గరకి పోదాం.. వెంటనే సిట్టింగ్ జడ్జితోని ఎంక్వయిరీ చేయిద్దాం. సిట్టింగ్ జడ్జి గనుక ఇందులో తప్పులు ఎం జరగలేదు అంటే.. తాను రాజకీయ సన్యాసం చేస్తా. హైకోర్టు సీజే దగ్గరికి రాడానికి మంత్రిగారికి ఇబ్బంది ఉంది అంటే డేట్, టైం ఫిక్స్ చేయండి ఇద్దరం కలిసి కేంద్రంలో ఉండే సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ దగ్గరికి ..మిగతా 2లో



### గాజాలోని పాఠశాలపై

## ఇజ్రాయెల్ వైమానిక దాడి

### ఏడుగురు మృతి

గాజా, సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం): గాజా నగరంలోని ఓ పాఠశాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఏడుగురు మృతి చెందారు. ఈ వ్యక్తులు తమ ప్రాణాలను కాపాడుకోవడం కోసమని పాఠశాలలో ఆశ్రయం పొందుతున్నారు. కాగా.. ఈ ఘటనపై పాలస్తీనా అధికారులు సమాచారం ఇచ్చారు. అయితే.. పాఠశాల ఆవరణలో తలదా చుకున్న వారిని చంపేందుకు లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో కాఫర్ ఖాసెం స్కూల్‌లో ఈ దాడి జరిగినట్లు ..మిగతా 2లో

### నన్ను అవినీతిపరుడిగా నిరూపించేందుకు

## మోదీ కుట్ర

### అరవింద్ కేజ్రీవాల్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం): తనను అవినీతిపరుడిగా నిరూపించేందుకు ప్రధాని మోదీ కుట్ర పన్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని మోదీ భావించారంటూ మండిపడ్డారు. ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన 'జనతాకీ అదాలత్' కార్యక్రమంలో అరవింద్ కేజ్రీవాల్ ..మిగతా 2లో



### డీజేను శాశ్వతంగా

## బ్యాన్ చేయాలి

### అసదుద్దీన్ ఓవైసీ సంచలన కామెంట్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం): పండగ వచ్చినా.. పెళ్లి జరిగినా.. ఇంకా ఏ శుభకార్యమైనా ఇప్పుడు అందరికీ డీజే ర్యాలీలు తీయడం ఒక ఆనవాయితీగా మారింది. కుటుంబ సభ్యులతో, స్నేహితులతో సరదాగా డాన్సులు చేస్తూ ఊరంతా తెలిసేలా హోరెత్తించడం ఇప్పుడు ఒక సంప్రదాయంగా మారింది. డీజే కొట్టు.. దుమ్ము రేపు అన్నట్లుగా ముఖ్యంగా యువత దీనికి బాగా ఆకర్షితులవుతున్నారు. కొందరు.. ఈ డీజే సౌండ్‌లతో చెవులకు చిల్లులు పడేలా నానా హంగామా చేస్తున్నారు. కానీ అది ఆ చుట్టుపక్కల వారికి ఇబ్బందికరంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. డీజే డాన్సులతో యువత చెడిపోతున్నారని, తద్వారా ప్రజల్లో దీని వల్ల ..మిగతా 2లో

### గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో

## చిరంజీవి


### అభినందనలు తెలిపిన చంద్రబాబు, రేవంత్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం): మెగాస్టార్ చిరంజీవి.. తన 45 ఏళ్ల కెరీర్‌లో 24 వేల డాన్స్ మూవ్‌మెంట్స్ చేసినందుకు.. ఆయనకు గిన్నీస్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు అమిర్‌ఖాన్ చేతుల మీదుగా ఈ అవార్డును మెగాస్టార్ అందుకున్నారు. చిరంజీకి ఈ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

**డాన్స్‌పై ఉన్న ఇష్టమే తనను ఇక్కడి వరకూ తీసుకొచ్చిందన్న మెగాస్టార్:**

మెగాస్టార్ చిరంజీవి తన 45 ఏళ్ల సినీ ప్రస్థానంలో .. 156 సినిమాల్లో 537 పాటల్లో దాదాపు 24 వేలకు పైగా వివిధ డాన్స్ మూవ్‌మెంట్స్ చేశారు. ఇందుకు గానూ గిన్నీస్ బుక్ ఆఫ్ ..మిగతా 2లో



# బైడెన్‌తో చర్చలు ఫలించాయి

మొదటి పేజీ తరువాయి...

జరిగిన తొలి క్వాడ్ సదస్సును ప్రధాని గుర్తుచేసుకున్నారు. చాలా తక్కువ సమయంలో క్వాడ్ దేశాలు సహకారాన్ని ప్రతి దిశలో విస్తరించాయని చెప్పారు. 2025లో ఈ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తుండటంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ.. డెలవేర్‌లోని బైడెన్ నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువు నేతలు ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలు, భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చించారు. సమావేశం అనంతరం చర్చలు ఫలప్రదమైనట్లు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తెలిపారు. 'డెలవేర్‌లోని గ్రీన్‌విల్లేలో ఉన్న తన నివాసంలో నాకు ఆతిథ్యమిచ్చినందుకు అధ్యక్షుడు బైడెన్‌కు ధన్యవాదాలు. మా చర్చలు ఫలవంతమయ్యాయి. ఈ సమావేశంలో ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై చర్చించడానికి మాకు అవకాశం లభించింది' అంటూ ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ ట్వీట్‌కు బైడెన్ స్పందించారు.. భారత్‌తో అమెరికా భాగస్వామ్యం చరిత్రలో ఎప్పుడూ లేనంత బలమైందని చెప్పారు. ఇరు దేశాల భాగస్వామ్యం సన్నిహితమైంది, చైతన్యవంతమైనదని తెలిపారు. మోదీతో భేటీ అయిన ప్రతిసారీ ఇరు దేశాలకు సంబంధించిన కొత్త అంశాలపై చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

## గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిరంజీవి

మొదటి పేజీ తరువాయి...



రికార్డ్స్‌లో ఆయనకు చోటు దక్కింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో.. అమిర్‌ఖాన్ చేతుల మీదగా గిన్నీస్ బుక్ ప్రతినిధులు మెగాస్టార్ చిరంజీవికి ఈ రికార్డును అందించారు. చిన్న నాటి నుంచి తనకు డ్యాన్స్ అంటే ఎంతో ఇష్టమన్న చిరంజీవి.. చిన్నతనంలో రేడియోలో పాటలు వింటూ డాన్స్ చేసేవాడినని చెప్పారు. ఆ తర్వాత ఎన్‌సీసీలో చేరిన తర్వాత.. రాత్రిళ్లు భోజనం ప్లేట్‌తో దరువేస్తూ డాన్స్ చేసేవాడినని నాటి రోజులను చిరంజీవి జ్ఞాపకం చేసుకున్నారు. డాన్స్ చేస్తూ పడి కాలుకు దెబ్బతగిలితే.. ఆ తర్వాత వేసిన స్టెప్పులునాగిని డాన్స్‌గా మారాయని చిరంజీవి చెప్పారు. సినిమాల్లోకి వచ్చిన మొదట్లో తనను సావిత్రి, రోజారమణి, నరసింహరాజు ప్రోత్సహించారని.. వారి ప్రోద్బలంతోనే ప్రాణం ఖరీదు సినిమాలో డైరెక్టర్ క్రాంతికుమార్ నా కోసం ఓ డ్యూయెట్ పెట్టి స్టెప్పులు వేయించడంతో తన ప్రయాణం ఇక్కడి వరకూ వచ్చిందన్నారు. పునాదిరాళ్లు సినిమాతో నా డ్యాన్స్ ప్రధాన ఆకర్షణగా మారిందన్నారు. నిర్మాత అశ్వనీదత్ అల్లు అరవింద్ ప్రతి సినిమాలో ఆరు పాటలు ఉండేలా చూసే వాళ్లని వారితో పాటు తనతో పనిచేసిన దర్శక నిర్మాతలకు, హీరోయిన్లకు, డ్యాన్స్ కొరియోగ్రాఫర్లకు చిరంజీవి కృతజ్ఞతలు తెలిపారు.

**చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపిన సీఎంలు:**

గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన చిరంజీవికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఇది తెలుగు వారి గర్వించదగ్గ అంశంగా పేర్కొన్నారు. చిరంజీవికి గిన్నీస్ బుక్‌లో చోటు లభించడం పట్ల శుభాకాంక్షలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. చిరంజీవి తన గ్రేస్‌తో తెలుగు సినిమాను మరో ఎత్తులకు తీసుకెళ్లడంతో తిరుగులేని కృషి చేశారని అన్నారు.



## శ్రీలంక కొత్త అధ్యక్షుడిగా అనుర కుమార దిసనాయకే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం)::శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో అనుర కుమార దిసానాయకే(55) విజయం సాధించారు. ఆయన శ్రీలంక అధ్యక్ష పదవిని అధిరోహించబోతున్నారు. మార్క్సిస్ట్ నేతగా, జనతా విముక్తి పెరమున పార్టీకి చెందిన అనుర కుమార రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో గెలుపొందారు. 2022 ఆర్థిక మాంద్యం తర్వాత జరుగుతున్న తొలి అధ్యక్ష ఎన్నికలు ఇవే. శ్రీలంక అధ్యక్ష ఎన్నికల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒక అభ్యర్థి విజయం మొదటి రౌండ్‌లో తేలకుండా రెండో రౌండ్‌కి చేరుకోవడం ఇదే తొలిసారి. మొదటి రౌండ్‌లో ఏ అభ్యర్థికి 50 శాతం కన్నా ఎక్కువ ఓట్లు రాకపోవడంతో, రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుకు వెళ్లాల్సి వచ్చింది. శ్రీలంక అధ్యక్ష ఎన్నికలకు శనివారం ఓటింగ్ జరిగింది. వెంటనే కౌంటింగ్ మొదలైంది. ప్రతిపక్ష నేత సాజిత్ ప్రేమదాస రెండో స్థానంలో నిలిచారు. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే మూడో స్థానంలో నిలిచి పోటీ నుంచి నిష్క్రమించారు. 20 ఏళ్లుగా పార్లమెంట్‌లో ఉన్న దిసానాయకేపై శ్రీలంక ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. శ్రీలంకలో రాజకీయంగా ప్రాబల్యం ఉన్న రాజపక్స కుటుంబంపై ప్రజలు పూర్తిగా విశ్వాసాన్ని కోల్పోయారు. శనివారం జరిగిన ఎన్నికల్లో 55 ఏళ్ల దిసానాయకే 42.31% ఓట్లను సాధించారని, ప్రతిపక్ష నేత సజిత్ ప్రేమదాస రెండో స్థానంలో నిలిచారని శ్రీలంక ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. శ్రీలంకలోని 17 మిలియన్ల అర్హత కలిగిన ఓటర్లలో 75% మంది పాల్గొన్నారు.శ్రీలంక కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన దిసానాయకే తన విజయం తర్వాత జాతీయ ఐక్యత కోసం పిలుపునిచ్చారు. సింహాళీయులు, తమిళులు, ముస్లింలు మరియు శ్రీలంక ప్రజలందరి ఐక్యత ఇది కొత్త ప్రారంభమని అన్నారు.

# ఎమ్మెల్యేలకు సీఎం వార్నింగ్

మొదటి పేజీ తరువాయి...

సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సీఎల్పీ సమావేశంలో పీసీసీ కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బి. మహేశ్ కుమార్ గౌడ్‌ను సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ, కడియం శ్రీహరి, దానం నాగేందర్, ప్రకాశ్ గౌడ్ తదితరులు సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు. గతేడాది జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. సీఎంగా, పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి కొనసాగుతు వస్తున్నారు. అలాంటి వేళ.. పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. ఆ క్రమంలో బీసీ వర్గానికి చెందిన బి. మహేశ్ కుమార్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా ఇటీవల పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. దాంతో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. అయితే కొత్త పీసీసీ అధ్యక్షుడి నియామకం అనంతరం సీఎల్పీ సమావేశం జరగడం చాలా కాలంగా ఓ అనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. ఇక 2021లో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి కాంగ్రెస్ పార్టీని ఆయన ప్రజల్లోకి తీసుకు వెళ్లారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలను సైతం ఆయన తన వాగ్దాటితో వివిధ సభల్లో ఎండగట్టారు. ఆ క్రమంలో జరిగిన ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు.. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి.. బీఆర్ఎస్‌ను ప్రతిపక్షానికి పరిమితం చేసిన విషయం విధితమే.

## పార్టీ నాయకత్వం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడిగా నా ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం, లోక్ సభ సీట్లు గెలిచామని, మహేష్ కుమార్ గౌడ్‌ను తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కి ధన్యవాదాలు తెలుపుతు సీఎల్పీ ఏకగ్రీవ తీర్మానం చేస్తోందన్నారు. పార్టీ నాయకత్వం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రజల్లో ఉన్న వారికే జిల్లా అధ్యక్ష పదవులు ఇవ్వాలని పీసీసీకి సూచిస్తున్నా అని, పార్టీ అనుబంధ విభాగాల్లో పనిచేసిన 36 మందికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చామన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసినందుకే వారికి పదవులు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అంతేకాకుండా..'పార్టీ లో కష్టపడి పనిచేసిన వారికి ఖచ్చితంగా అవకాశాలు వస్తాయి నరేంద్ర మోదీని ఓడించాల్సిన చారిత్రాత్మక అవసరం ఉన్న సమయంలో పీసీసీ చీఫ్ గా మహేష్ గౌడ్ బాధ్యత చేపట్టారు.. బీసీ కులగణన చేయాలన్నది రాహుల్ గాంధీ బలమైన ఆలోచన రాహుల్ ఆలోచన మేరకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించాం.. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే కచ్చితంగా జనాభాను లెక్కించాల్సిందే.. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశాం.. సుప్రీం కోర్టు తీర్పు ను పూర్తిగా అధ్యయనం చేసి ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది.. దేశంపై నాలుగోసారి పట్టు సాధించడానికి మోడీ ప్రయత్నాలు చేస్తున్నాడు.. నాలుగో సారి గెలవడం కోసమే ప్రధాని మోదీ జమిలీ ఎన్నికలు తీసుకువస్తున్నారు.. జమిలీ ఎన్నికలపై అప్రమత్తంగా ఉండాలి తొమ్మిది నెలల్లో ఒక్క రోజు కూడా నేను సెలవు తీసుకోలేదు ప్రభుత్వం చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.. భారతదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం 27 రోజుల్లో 18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయలేదు.. రైతు రుణ విముక్తి కావడమే ప్రభుత్వ లక్ష్యం ఫ్యామిలీ డిజిటల్ కార్డు తీసుకురాబోతున్నం.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు ఇస్తాం%ొ% రాష్ట్రంలో ఎక్కడున్నా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తాం అధికారం కోల్పోయిన అసహనంలో ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోంది.. ఇంచార్జ్ మంత్రులు వారానికి రెండు సార్లు జిల్లాల్లో పర్యటించాలి పార్టీలో కష్టపడి పనిచేసే వారికి కచ్చితంగా అవకాశాలు వస్తాయి ' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.





## ఆదివారమూ ఆగని హైడ్రా

మొదటి పేజీ తరువాయి...

చేసుకుంది హైడ్రా.

**కిష్టారెడ్డిపేటలో మూడు భవనాలు కూల్చిన హైడ్రా**

సంగారెడ్డి జిల్లాకు, హైదరాబాద్‌కు వారధిలా ఉండే అమీన్‌పూర్ మున్సిపాలిటీలోనూ కూల్చివేతలు చేపట్టింది హైడ్రా. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో సర్వే నెంబర్ 164లో మూడు భవనాలు కూల్చివేసింది. అవి మూడూ భారీ బహుళ అంతస్తు భవనాలే కావడం విశేషం. వాణిజ్య పరంగా వాడుతున్న ఐదు అంతస్తుల భవనాన్ని నేలమట్టం చేసింది. అక్కడ కబ్జాచేసిన ఎకరం ప్రభుత్వం స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. అయితే నివాస గృహాలను కూల్చలేదనీ కేవలం కమర్షియల్ భవనాలనే కూల్చేశామనీ చెప్పారు.

**12/2, 12/3 సర్వేనెంబర్‌లోని 25 నిర్మాణాల కూల్చివేత**

పటేల్ గూడలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలన్నీ తొలిగించారు. సర్వే నెం.12/2, 12/3లోని 25 నిర్మాణాల కూల్చివేశారు. పటేల్ గూడలో 3ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. మొత్తం మూడు ప్రాంతాల్లో దాదాపు 8 ఎకరాలు ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా కమిషనర్ తెలిపారు. రెవెన్యూ, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్ తో కలిసి కూల్చివేతలు చేపట్టామన్నారు. నీటి వనరుల సంరక్షణ కోసం సంయుక్తంగా కృషి చేస్తున్నామనీ చెప్పారు రంగనాథ్. దూకుడుగా ముందుకెళ్తున్న హైడ్రా తదుపరి టార్గెట్ ఏ ఏరియా అన్నదే ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

## అమృత్ టెండర్లలో తప్పు జరగలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తా

మొదటి పేజీ తరువాయి...

పోదాం. మంత్రిగారికి, ముఖ్యమంత్రికి ఒకటే చెప్తున్నానని.. ఇప్పటికైనా టెండర్లు రద్దు చేయాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి అద్భుత ప్రగతి సాధించిందని కేటీఆర్ అన్నారు. పదేండ్లలో సింగరేణి లాభాలు గణనీయంగా పెరిగాయన్నారు. లాభాల్లో కార్మికుల వాటా పెంచుకుంటూ వచ్చామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో పది పైసల వాటా మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ పాలన ఉన్న ఐదేండ్లలో 10 పైసల వాటా మాత్రమే ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో 11 పైసల నుంచి 20 పైసల వరకు మాత్రమే ఇచ్చారన్నారు. 1999 నుంచి 2014 వరకు కేవలం రూ.376 కోట్లు మాత్రమే సింగరేణి కార్మకులకు ఇచ్చారు. కాంగ్రెస్ పాలనతో లాభాలు ఎన్నడూ రూ.400 కోట్లు దాటలేదు. లాభాలను వెయ్యి కోట్లు దాటించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే. తొమ్మిదిన్నరేండ్లలో తాము రూ.2,780 కోట్లు ఇచ్చామని చెప్పారు 2022–23లో సింగరేణి లాభాల్లో కార్మికులకు 32 శాతం వాటా ఇచ్చాం. సగటున ఒక్కో కార్మికుడికి రూ.లక్షా 60 వేలు చెల్లించాం. సింగరేణిని, కార్మికులను ముఖ్యమంత్రి వెన్నుపోటు పోడుస్తున్నడు. కార్మికుల రెక్కల కష్టాన్ని కాంగ్రెస్ సర్కార్ దోచుకుంటున్నది. 33 శాతం వాటా ఇస్తున్నామని సీఎం తప్పుడు ప్రకటనలు చేస్తున్నడు. సింగరేణి లాభాలు రూ.4701 కోట్లు అయితే 33 శాతం వాటా ఇచ్చామంటున్నారు. కార్మికులకు రూ.1551 కోట్లు బోనస్ ఇవ్వాలి. ఒక్కో కార్మికుడికి రూ.3.70 లక్షలు రావి. కానీ రూ.లక్షా 90 వేలు మాత్రమే ఇస్తున్నరు. 16 శాతం మాత్రమే ఇస్తున్నామని కాంగ్రెస్ ఒప్పుకోవాలి. సింగరేణి కార్మికులను మోసం చేయకండి. స్పష్టంగా చెప్పండి' అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. అనుబంధ సంఘాన్ని గెలిపించినందుకు మీరిచ్చేది ఇదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కుట్రపూరిత వైఖరిపై సీపీఐ కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడకపోతే సింగరేణిని ప్రైవేటుపరం చేస్తారన్నారు. ఈ కుట్రను కార్మికులు గుర్తించాలన్నారు. తాము చెప్పినదాంట్లో తప్పుంటే ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు.

## డీజేను శాశ్వతంగా బ్యాన్ చేయాలి

మొదటి పేజీ తరువాయి...

ఎలాంటి మంచి సందేశం వెళ్లడం లేదని అన్నారు. అందుకే మతపరమైన ర్యాలీల్లో డీజేలపై నిషేధం విధించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఒవైసీ విజ్ఞప్తి చేశారు. డీజే సంస్కృతితో ఆధ్యాత్మిక వాతావరణం కలుషితం అవుతోందని అనడంతో పాటు మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో భాగంగా చార్మినార్ వద్ద డీజే బాక్స్ పేలడంపై స్పందించారు. ఇది ఏ మాత్రం సమాజానికి పనికి వచ్చే చర్య కాదన్నారు. డీజే కావాలి అని కోరుకునే వాళ్లకు క్లబ్బులు, పబ్బులు లాంటివి సిద్ధంగా ఉంటాయని, అంతేకాని ఇలా నడిరోడ్డు మీద డీజే అంటూ పెట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించడం సరికాదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మిలాద్ ఉన్ నబీ వేడుకల సమయంలో చార్మినార్ వద్ద డీజే బాక్స్ పేలిపోయి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానిక అధికారులు ఆ మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. డీజే పేరుతో కొంతమంది చేసే వికృత చేష్టలు, విన్యాసాలతో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయి. మరోవైపు, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలో ఉరడీ మధు అనే యువకుడు డీజే శబ్దానికి గుండెపోటు వచ్చి మృతి చెందాడు. ఈ క్రమంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలంగాణలో డీజేను శాశ్వతంగా బ్యాన్ చేయాలని తెలిపారు. డీజే పేరుతో యువత హద్దులు మీరి ప్రవర్తిస్తోందని.. మతపరమైన కార్యక్రమాలే కాదు.. తెలంగాణలో డీజేకు అనుమతులు ఇవ్వొద్దని.. శాశ్వతంగా నిషేధం విధించాలని అసదుద్దీన్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

## గాజాలోని పాఠశాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడి

మొదటి పేజీ తరువాయి...



అధికారులు తెలిపారు. మృతి చెందిన వారిలో హమాస్ పబ్లిక్ వర్క్స్ అండ్ హౌసింగ్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మజీద్ సలీహ్ ఉన్నారు. హమాస్ మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకుని దాడి చేశామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ తెలిపింది. అక్కడి పౌరులకు ఎలాంటి నష్టం జరగకుండా వైమానిక దాడులు, ఇతర చర్యలను నిర్వహించామని చెప్పారు. ఆసుపత్రులు.. ఇతర ప్రభుత్వ భవనాలను సైనిక ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నట్లు ఇజ్రాయెల్ చేసిన వాదనలను హమాస్ ఎప్పటిలాగే తిరస్కరించింది. ఈ క్రమంలో.. ఇజ్రాయెల్ దళాలపై తమ సైనికులు అనేక దాడులు చేశారని హమాస్ సాయుధ విభాగం తెలిపింది. నివేదికల ప్రకారం.. మధ్య, దక్షిణ గాజా అంతటా వేర్వేరు వైమానిక దాడుల్లో ఆరుగురు అదనపు పాలస్తీనియన్లు మరణించారు. దీంతో ఆదివారం నాటి ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 16కి చేరింది. హమాస్ సాయుధ విభాగం రఫాలో ఇజ్రాయెల్ దళాలపై అనేక దాడులు చేసింది. ఇజ్రాయెల్ సైన్యం ప్రతిస్పందనగా, రఫాలో తమ బలగాలు అనేక మంది మిలిటెంట్లను హతమార్చాయని.. అంతేకాకుండా సైనిక మౌలిక సదుపాయాలను కూల్చివేశాయని పేర్కొంది. అయితే ఈ వివాదం మధ్య అవసరమైన విడి భాగాలు, జనరేటర్లకు ఇంధనం కొరత కారణంగా అన్ని ఆసుపత్రి సేవలు పది రోజుల్లో నిలిపివేయవచ్చని ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. అదనంగా, భారీ వర్షం డేరా శిబిరాల్లో వరదలకు కారణమైంది. తద్వారా నిర్వాసిత కుటుంబాల దుస్థితి మరింత తీవ్రమవుతోంది. యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జూలియెట్ టౌమా మాట్లాడుతూ.. శీతాకాలం రాబోతోందని, ప్రజలకు ఆశ్రయం, సామాగ్రి అవసరమని అన్నారు. గతేడాది అక్టోబర్ 7 నుంచి ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్ పై దాడి చేసింది. ఇందులో దాదాపు 1200 మంది చనిపోయారు. దీని తరువాత, ఇజ్రాయెల్ దాడుల్లో 41,300 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు.

## నన్ను అవినీతిపరుడిగా నిరూపించేందుకు మోదీ కుట్ర

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడారు. 'ప్రధాని నరేంద్ర మోదీ మాపై కుట్ర పన్నారు. నన్ను, (ఆప్ నేత) మనీష్ సిసోడియా అవినీతిపరుడని నిరూపించేందుకు కుట్ర పన్నారు. మా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించారు' అని అన్నారు. కాగా, తాను గత పదేళ్లుగా నిజాయితీతో ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపానని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని ప్రధాని మోదీ భావించారని విమర్శించారు. 'సీఎం కుర్చీపై ఆకలి లేకపోవడం వల్లే రాజీనామా చేశా. డబ్బు సంపాదించడానికి కాదు, దేశ రాజకీయాలను మార్చేందుకే వచ్చా' అని అన్నారు. సీఎం పదవికి రాజీనామా చేసిన తాను మరికొద్ది రోజుల్లో సీఎం అధికార నివాసం నుంచి వెళ్లిపోతానని తెలిపారు. పదేళ్లపాటు సీఎంగా ఉండి కూడా ఢిల్లీలో తనకు సొంత ఇల్లు లేదన్నారు. మరోవైపు బీజేపీ తనను అవినీతిపరుడని అనడంతో బాధపడ్డానని కేజ్రీవాల్ ఆవేదన వ్యక్తం చేశారు. 'అరవింద్ కేజ్రీవాల్ నిజాయితీ లేనివాడైతే ప్రజలకు ఉచిత విద్యుత్తు, మహిళలకు బస్సు చార్జీలు ఉచితంగా ఇచ్చేవాడా? పిల్లల కోసం స్కూళ్లు కట్టించేవాడా? ఆసుపత్రుల్లో వైద్యం ఉచితంగా అందించేవాడా? ' అని ప్రశ్నించారు. 22 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందని, వారు ఏ రాష్ట్రంలోనైనా ఉచిత విద్యుత్తు లేదా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారా? అని నిలదీశారు. 'నేను దొంగనా? లేదా కేజ్రీవాల్‌ను జైలుకు పంపిన వ్యక్తులు దొంగలా?' అని ప్రశ్నించారు.

# విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నాం: సిజిఎం ఆనంద్

## క్షేత్రస్థాయిలో త్వరగా సమస్యలు పరిష్కరిస్తున్నాం: ఎస్ ఈ శ్రీరామ్మోహన్



వర్షానికి ఏర్పడిన విద్యుత్ సమస్యల పనులను పునరుద్ధరిస్తున్న ఎస్ ఈ శ్రీ రామ్మోహన్, డి ఈ రత్నాకర్ రావు



వర్షాలకు కూలిన చెట్టుతో ఏర్పడిన విద్యుత్ సమస్యలను పరిష్కరించిన సిబ్బంది



పనులను పర్యవేక్షిస్తున్న ఎస్ ఈ రామ్మోహన్, డి ఈ రత్నాకర్ రావు

బండ్లగూడ, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం) ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు క్షేత్రస్థాయిలో ఏర్పడిన విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది రాత్రి పగలు అనగా పనిచేసి విద్యుత్తు సరఫరా పునరుద్ధరిస్తున్నారని టీజీఎస్పీడీసీఎల్ ఆర్ఆర్ జోన్ సీజీఎం ఆనంద్ తెలిపారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెట్లు విరగడం దీంతో విద్యుత్తు సరఫరా కు అంతరాయం ఏర్పడటం పై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సిజిఎం ఆనంద్, రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్మోహన్, రాజేంద్రనగర్ డివిజన్ డి ఈ రత్నాకర్ రావులతో కలిసి ఆయన చిత్ర స్థాయిలో పర్యవేక్షించి సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని రాజేంద్రనగర్ సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సత్యనారాయణ, హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సన్ సిటీ రోడ్ నెంబర్ 6 నెం 11 వరకు విరిగిన స్తంభాలను పునరుద్ధరించారు, పి అండ్ టి కాలనీ, రాధానగర్, నర్సా రెడ్డి కాలనీలో పెద్ద చెట్లు కూలిపోయాయి కాలనీలో రాత్రికి హిమాయత్‌సాగర్ సెక్షన్‌లో ప్రధాన సమస్యలన్నీ వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను సక్రమంగా జరిగేలా పనులు చేపట్టారు. కిస్మత్ పూర్ సెక్షన్‌లో ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్, డాన్‌బోస్కో స్కూల్, బండ్లగూడ గ్రామాలు , దర్గా ప్రాంతాలలో చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు ఏర్పడిన అంతరాయానికి పనులు చేపట్టి పునరుద్ధరించారు. శనివారం రాత్రి గాలులతో కురిసిన బహరి వర్షానికి లక్షల రూపాయల నష్టం ఏర్పడిందని సీజీఎం ఆనంద్ తెలిపారు. టీజీఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బంది బాధ్యత అయితంగా విధినిర్వానలో ఎంతో ఓపికతో పనిచేసి వినియోగదారులకు సత్వరమే సరఫరా అందించేందుకు పనిచేశారన్నారు.



1999-2000 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు

## శివరాంపల్లి జడ్పీహెచ్ఎస్ 1999-2000 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

### తమ కు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి జెడ్పి హెచ్ఎస్ లో 1999-2000 విద్యా సంవత్సరం లో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు సురేందర్ రెడ్డి , కృపాకర్ రెడ్డి, రామ్నాథ్ రెడ్డి, నాగయ్య, అరుణ, నరసింహ చారి, కిషన్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి లను సన్మానించారు. విద్యార్థులు బొడ్డు నరేష్, రఘువీర్, శ్రీరాములు, మహేష్, కే రాజు ,సంతోష్, మాధవి, అర్చన, స్వాతి, సుమలత, మమత,శ్వేత పాల్గొన్నారు.



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఉపాధ్యాయులు



బాధితులతో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

## అనుమానాస్పద రీతిలో చనిపోయిన మైనర్ బాలిక కుటుంబానికి న్యాయం చేయాలి

### ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం)కేటీ దొడ్డి మండలంలో అనుమానాస్పద రీతిలో చనిపోయిన మైనర్ బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. మైనర్ బాలిక ఆత్మహత్యకు గల కారణం లైంగిక వేధింపులేనని బాలిక తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న నేపథ్యంలో పోలీసులు నిష్పక్షపాతికంగా లోతైన విచారణ జరిపి నిందితులపై హత్య కేసు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో వరుస సంఘటనలు జరగడమే కాక 19 సంవత్సరంలోపు యువకులు పెడదారినబట్టి మత్తు పదార్థాలకు అలవాటు పడి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీటన్నిటి పైన పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల నాయకులు ఖండించడమే కాక ఇట్లాంటి వాటిని ప్రోత్సహించకూడదని, ప్రజలను రక్షించాల్సిన కొందరు నాయకులు నేరస్తులకు భద్రత కల్పిస్తున్నారని ప్రజల్లో అపోహ ఉందని విమర్శించారు. పరామర్శించిన వారిలో కన్వీనర్ బుచ్చిబాబు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రేమ్ రాజ్, వన్నప్ప,రేణప్ప, భీమన్ గౌడ్,దస్తగిరి గౌడ్ రామాంజనేయులు, బంగి పరుష, అంజి, దొడ్డన్న,తదితరులు ఉన్నారు.



## వాసవి ఆర్యవైశ్య పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం చైర్మన్‌గా సోమా శ్రీనివాస్ గుప్తా

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ శివరాంపల్లి శ్రీ వాసవి ఆర్యవైశ్య పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. సంఘం చైర్మన్ గా సోమా శ్రీనివాస్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘంలో 9 మంది డైరెక్టర్లు ఉంటారు. అయితే ఈ ఎన్నికల్లో 18 మంది సభ్యులు పోటీలో పడ్డారు. 9 మంది డైరెక్టర్లకు 18 మంది పోటీలో ఉండటంతో సంఘం పెద్దలు సమన్వయం చేస్తే పోటి నుంచి 9 మందిని విరమింప చేశారు. సంఘం ఐకమత్యం ఉండాలని పెద్ద మనస్సు చేసుకుని పోటీలో ఉన్న సభ్యులు విత్ డ్రా చేసుకున్నారు . సరాబు అనంతం గుప్తా వైస్ చేర్మెన్ గాఎన్నుకున్నారు.డైరెక్టర్ లు గా ఓరగంటి మల్లేష్ గుప్తా , సేడం వెంకటరమణ గుప్తా, సెడం శ్రీనివాస్ గుప్తా , న్యాలాంటి నర్సంహా గుప్తా , గోంగూలి వెంకటేశం గుప్తా , చవ్వ వెంకటేష్ గుప్తా, కొండా కృష్ణయ్య గుప్తా లు ఎన్నికయ్యారు. తమను సంఘం కార్యవర్గ బాధితులుగా ఎన్నుకున్న సభ్యులు, పెద్దలకు ధన్యవాదములు తెలియజేశారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవు

## విద్యుత్ షాక్‌తో ఆవు బలి

### ట్రాన్స్ ఫార్మర్‌కు కంచ లేకపోవడంతో ఆవు మృతి చెందిందని యజమాని ఆవేదన

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ లక్ష్మీగూడ బృందావన్ కాలనీ లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కు కంచ లేకపోవడంతో విద్యుత్ శాఖ గురై ఆవు మృతి చెందింది. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు కంచ లేకపోవడంతో గొరిగే రాజేష్ అనే వ్యక్తికి చెందిన ఆవు ట్రాన్స్ ఫార్మర్ పక్కనుండి వెళుతుండగా విద్యుత్ ఘాతానికి గురై సంఘటన స్థలంలోనే మృతి చెందింది.ఈ ఘటనతో ఒక్కసారిగా స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు.రోడ్డు ప్రక్కన కేవలం మనుషులు అందుకునే ఎత్తులో కరెంటు ట్రాన్స్ ఫార్మర్ ఉండడం ప్రతిరోజు ఈ దారి గుండా చిన్నారులు, పెద్దలు రాకపోకలు సాగిస్తున్నరని స్థానికులు తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ విషయంపై ఎన్నిసార్లు విద్యుత్ శాఖ అధికారులకు సమస్యను విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని, ఎవరైనా మనిషి విద్యుత్ ఘాతనీకి గురై చనిపోయిన తర్వాత విద్యుత్ శాఖ అధికారులు స్పందిస్తారా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు... ప్రమాదక రీతిలో ఉన్న ట్రాన్స్ఫారంకు కంచె అయిన ఏర్పాటు చేయాలని, ట్రాన్స్ఫార్మర్ ఎత్తు పెంచాలని స్థానికులు కొడుతున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

## కొత్త చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం

### సెమినార్‌లో వక్తల అభిప్రాయం

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం)పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం గద్వాల పట్టణంలోని తెలంగాణ జన సమితి కార్యాలయంలో అ సంస్థ గద్వాల జిల్లా కో కన్వీనర్ హనుమంతు అధ్యక్షతన "ప్రజాస్వామ్యం -జర్నలిజం", "నూతన క్రిమినల్ చట్టాలు- దేశ అవసరాలు" అనే అంశాలపై సెమినార్ నిర్వహించారు. వక్తలుగా ఎం.ఎ. సత్యనారాయణ, ఎండీ. ఇక్బాల్ పాషా సభనుద్దేశించి చేసిన ప్రసంగాలు సభికులలో సృజనాత్మక ఆలోచనలు రేకెత్తించాయి. ఈ సందర్భంగా వక్త ఎంఏ సత్యనారాయణ మాట్లడుతూ.. ప్రజాస్వామ్యానికి వెన్నెముక కావాల్సిన జర్నలిజం అభద్రతలో చిక్కి అల్లాడే పరిస్థితులు దాపురించాయని, ఇది దేశ అభివృద్ధి, భద్రతకు పొంచి ఉన్న ముప్పును సూచిస్తుందని అన్నారు. చరిత్ర పొడవునా జర్నలిజం పై హింస పైచేయిగా కొనసాగుతున్నదని రుజువు చేస్తున్నదని, నిజాలు నిర్భయంగా రాస్తున్నందుకు ప్రాణాలు పోగొట్టుకుంటున్న పత్రికా విలేఖరుల ఉదంతాలను షోయబుల్లా ఖాన్ నుండి గౌరీలంకేష్ దాకా సోదాహరణగా వివరించారు. నూతన క్రిమినల్ చట్టాలు - దేశ అవసరాలు అంశంపై ఎండీ. ఇక్బాల్ పాషా మాట్లాడుతూ.... ఇటీవల రూపోంది జూలై 1 నుండి అమలులోకి వచ్చిన మూడు భారతీయ నూతన క్రిమినల్ చట్టాలు కోర్టుల్లో లక్షలాదిగా పేరుకు పోయిన పెండింగ్ కేసుల సమస్యను మరింత జటిలం చేసేవిధంగా ఉన్నాయన్నారు. పౌరులను పాలితుల స్థాయికి దిగజార్చి, బాధ్యతలకే పరిమితం చేసి రాజ్యాంగం కల్పించిన హక్కులను నిర్వీర్యం చేసేవిగా, అణచివేతను తీవ్రం చేసేవిగా, పోలీసులకు అపరిమిత అధికారాలను కట్టబెట్టేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. కొత్త చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని, విస్తృత చర్చ లేకుండానే అనేక స్థాయిల్లో చర్చించామని బుకాయించి ఆధారాబాదరాగా ఎన్నికల క్లిష్ట సమయంలో వర్షాకాల పార్లమెంట్ సెషన్ చివరిరోజు చర్చకు తావు లేకుండా ప్రవేశపెట్టారని, శీతాకాల సమావేశల్లో పార్లమెంటు భద్రత అంశంపై చర్చ సందర్భంలో ఉభయ సభలనుంచీ 146 మంది ప్రతిపక్ష సభ్యులను బహిష్కరించి ఆమోదానికి ప్రయత్నించారన్నారు. 2వ బిల్లును ఉప సంహరించుకొని డిశంబర్ 19 న మళ్ళీ మూడు చట్టాల రెండో బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవ ఆమోదం జరుపుకొని రాష్ట్రపతి సంతకం తో గజిట్లో ప్రచురించి జులై 1,2024 నుండి అమలులోకి వస్తుందని ఫిబ్రవరి 24 న నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. చట్టాల రూపకల్పనలో విశాల దృక్పథమే ఉంటే.. విస్తృత, సమగ్ర చర్చ జరుగకుండా ప్రతిష్టాత్మాక దేశ ముఖ్య చట్టాల అమలులో ఇంత ఆదరాబాదిరి తొందర ఎందుకో అర్థం కాదనీ, ఆచరణలో అసలు సారం అర్థమవక పోదనీ,నిజానికి ఇప్పుడు దేశం ఎదురుకుంటున్న అదుపులేని నిత్యావసరాల ధరలూ, మహిళలపై పెచ్చరిల్లు తున్న హింస, విదేశీ స్వదేశీ కార్పొరేట్ శక్తుల కు దేశ వనరుల తరలింపు, లాభదాయక ప్రభుత్వరంగా సంస్థల అమ్మకాలూ, నిరుద్యోగం, వ్యవసాయరంగ సంక్షోభం, రైతు ఆత్మహత్యలూ తదితర తక్షణ సవాళ్లకు పరిష్కారాలు వీటి ద్వారా లభించగలవా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట స్వామి, కార్యవర్గ సభ్యుడు నర్సింహా, సీఎల్ సి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సుభాన్, రైతు సంక్షేమ సమితి కృష్ణయ్య, గోవిందు, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ బాబు, ఎంఆర్పీ ఎస్ రహేమతుల్లా, సాదతుల్లా, రచయిత, కవీ జానజ్వాల, నాగేశ్వరా చారి తదితరులు పాల్గొన్నారు.



కవి ,రచయిత వేము వందనమును సన్మానించి సర్టిఫికెట్ అందజేస్తున్న ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి

## డాక్టర్ వేము వందనం సన్మానించిన కరీంనగర్ భవాని సాంస్కృతిక సంస్థ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం) కరీంనగర్ భవానీ సాంస్కృతిక సంస్థ రవీంద్ర భారతిలో నిర్వహించిన శ్రీ భగవద్గీత పస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని భవానీ కాలని(ప్రేమావతి పేట)కి చెందిన రచయిత,నటులు, దర్శకులు డాక్టర్ వేము వందనం కవిమ్మేళనంలో తన కవితా గానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, అతిథి ఆచార్య మసన చెన్నప్ప, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ లు పాల్గొని కవులు, రచయితలకు సన్మానం చేశారు. డాక్టర్ వేణు వందనములు శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల కవులు, రచయితలు తరలి వచ్చారు.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: వనపర్తి ఎమ్మెల్యే టి మేఘారెడ్డి

### వనపర్తి ఎమ్మెల్యే టి మేఘ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన కొత్తగా నియమితులైన పెబ్బేర్ మార్కెట్ చైర్మన్ జి ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి



వనపర్తి, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం) పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా నియమితులైన జి ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు ఆదివారం వనపర్తి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే మెగారెడ్డిని శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మెగా రెడ్డి నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి మేఘారెడ్డి మాట్లాడుతూ... రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నూతన పాలకవర్గం రైతులకు మరిన్ని సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వనపర్తి రోడ్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, పెబ్బేర్ ఎంపీపీ సుజాత రమణ, పెబ్బేర్ మాజీ సర్పంచ్ అక్కి సుశీల శ్రీనివాస్ గౌడ్, సురేందర్ గౌడ్, రాజశేఖర్, దయానంద రెడ్డి,మూల మల్ల యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రైతులు ఆర్గానిక్ పంటలను పండించాలి

### ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి చిన్నారెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం) రైతులు ఆర్గానిక్ పంటలను పండించాలని,వర్మి కంపోస్టు ఎరువుల ద్వారా పంటలను ఉత్పత్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి చిన్నారెడ్డి కోరారు. ఆదివారం గద్వాల బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆర్గానిక్ దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. అధిక పురుగుల మందులు, ఎరువులు వాడడం వల్ల అనేక రకాల రోగాలు, జబ్బులు వస్తున్నాయని అన్నారు. భవిష్యత్ లో పంట పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున,రైతులు అప్రమత్తమై వర్మీ కంపోస్ట్ ఎరువులతో పండించాలన్నారు. వర్మి కంపోస్టు వాడకం వల్ల నేలలు సారవంతమవుతాయన్నారు. రైతులు తిరిగి పాత పద్ధతిలో వ్యవసాయం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. రైతులు పాడి పశువులను పెంచి పోషించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆవులు, బర్రెలు, మేకలు, గొర్రెలు, తదితరాలను పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని ఉపాధి రంగంగా తమతో పాటు, తమ పిల్లలను కూడా వ్యవసాయ అలవాట్లను,పద్ధతులను నేర్పించాలని రైతులను కోరారు. సన్న,చిన్న కారు , మధ్య కారు రైతులు చిరుధాన్యాలను, కూరగాయలను, ఆకుకూరలను ఉత్పత్తి చేయాలన్నారు. ఆకుకూరలు, తక్కువ కాలంలో పండించి అధిక లాభాలు పొందవచ్చు అన్నారు. రైతులు పశుసంపదను పెంచుకోవడం వల్ల అనేక లాభాలు పొందవచ్చు అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ తదితరులు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు చేపట్టి నేడు 145కోట్ల దేశ జనాభా కు సరిపడే ఆహారపు ఉత్పత్తులను రైతులు పండిస్తున్నారన్నారు. దేశానికి సరిహద్దులో జవాన్ సేవలు ఎంత ముఖ్యమో, కిసాన్ సేవలు కూడా అంతే ముఖ్యమని చిన్నారెడ్డి అన్నారు. దేశానికి అన్నం పెట్టేదే రైతు కాబట్టి రైతే రాజు అని రాజకీయ ప్రముఖులు శాస్త్రవేత్తలు బిరుదు ఇచ్చారన్నారు. జై జవాన్ జై కిసాన్ నినాదంతో ముందుకు సాగాలన్నారు. పంటలకు అధిక ఎరువులు, మందులు వాడి పంటలు పండించడం వల్ల ఆరోగ్యాలు చెడిపోతున్నాయన్నారు. మందులతో పండించిన ఆహార ఉత్పత్తులను తీసుకోవడం వల్ల వైద్యుల వద్దకు వెళ్లి మందులు తినాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చత్తీస్‌గడ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో పశువుల పేడను, మూత్రన్ని మహిళా సంఘాల ద్వారా సే కరించి వాటి ద్వారా వర్మీ కంపోస్టు ఎరువును తయారుచేసి ప్రభుత్వము తక్కువ రేటుకు రైతులకు సరఫరా చేయడం వల్ల అక్కడ రైతులు ఆర్గానిక్ ఉత్పత్తులను పండిస్తున్నారన్నారు. ఆర్గానిక్ పంటలు పండించడం వల్ల రైతులకు ప్రజలకు, అనేక రకాల ఆరోగ్యకరమైన మేలు జరుగుతుందన్నారు. బ్రహ్మ కుమారి అరుంధతి బెహన్ జీ మాట్లాడుతు దేశానికి అన్నం తినిపించేవాడు రైతు అన్నారు. అందుకే రైతును రాజు అని పిలుస్తున్నారన్నారు. ప్రతి రైతు తమ పిల్లలకు వ్యవసాయ పద్ధతులు నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతు అనేవాడు ముందు వరుసలో నిలబడి ఉండేవాడని ప్రస్తుతము రైతు చిట్టచివరికి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాను రాను వ్యవసాయం చేసేందుకు రైతులు, రైతు కుటుంబాలు, రైతుల పిల్లలు ఇష్టపడటం లేదన్నారు. రైతులు పాత పద్ధతిలోకి వచ్చి వ్యవసాయ రంగాన్నే ప్రాధాన్యత ఇచ్చి అన్ని రకాల పంటలను ఆర్గానిక్ పద్ధతిలో పండించాలని సూచించారు. రైతులు తమ పిల్లలను చదువుతోపాటు వ్యవసాయ వ్యవసాయ పద్ధతులు నేర్పించాలన్నారు. ప్రతి రైతు తమ పిల్లలు ఉత్తమ రైతుగా ఎదగాలని మొదట కోరుకోవాలని, ఆ తర్వాత ఇతర పదవులు పొందాలని కోరుకోవాలి అన్నారు. బ్రహ్మకుమారి బెహన్ జీ మంజులత మాట్లాడుతూ రైతులు ఆధ్యాత్మిక తో ఆర్గానిక్ పంటలు పండించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్గానిక్ పంటలు పండిస్తున్న రైతులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి సన్మానించారు. మెమొంటోలను బహుకరించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి ప్రతినిధులు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి కి ఘనంగా సన్మానించారు. అయ్యప్ప రెడ్డి రాజశేఖర్ రెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి, కృష్ణకాంత్, మాజీ జెడ్పిటిసి పటేల్ అరుణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి,బ్రహ్మ కంప్యూటర్ నిర్వాహకులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి సన్మానిస్తున్న బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు

# 44 వసంతాలు పూర్తయిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




1979-1980 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్

## గద్వాల మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్, చిన్ననాటి మిత్రులు 44 సంవత్సరాల తరువాత స్నేహితుల ఆత్మీయ కలయిక

గద్వాల జిల్లా ప్రతినిది, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం) గద్వాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్లో 1979-1980 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఎంతో ఆత్మీయంగా జరిగింది. ఆదివారం గద్వాల జిల్లా కేంద్రంలోని బీరెల్లి చౌరస్తా గల ఎస్ వి ఎస్ బంక్వాట్ హాల్లో జరిగిన 1979 - 80 బ్యాచ్ ప్రభుత్వ ప్రాక్టింగ్ హై స్కూల్ పాఠశాలలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్ ఎస్ ఎస్ సి బ్యాచ్ చిన్ననాటి మిత్రులు హాజరయ్యారు.ముందుగా పాఠాలు చెప్పిన గురువులు లక్ష్మీదేవి ,నాగేశ్వరరావు ,నర్సోజి రావు , కృష్ణయ్య గారికి పూలమాల వేసి శాలువా కప్పి మెమొంటోను అందజేసి ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా గద్వాల్ మున్సిపల్ చైర్మన్ కేశవ్ మాట్లాడుతూ 44 సంవత్సరాలు తర్వాత అందరి స్నేహితులను కలుసుకోవడంతో చాలా ఆనందంగా ఉదన్నారు ఒకరి నొకరు ఆప్యాయంగా పలుకరించుకొని వారి కుటుంబల పరిస్థితిలను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు పాఠశాలలో వారి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం గురువులతో కలిసి అందరూ విందు భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాక్టింగ్ హై స్కూల్ పాఠశాల గురువులు, ఎస్ ఎస్ సి బ్యాచ్ చిన్ననాటి స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం సోదరులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న సతీష్ రెడ్డి

## ఘనంగా మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహ్ అలేహీవ సల్లాం జన్మదిన వేడుకలు

### సుమారు 2వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించిన కూకట్‌పల్లి నియోజకవర్గ ముస్లిం యూత్...

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం) మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహ్ అలేహీవ సల్లాం జన్మదిన వేడుకలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం కేపీహెచ్బీ టెంపుల్ బస్ స్టాప్ లో కూకట్ పల్లి నియోజకవర్గ ముస్లిం యూత్ మహమ్మద్ మగ్దుము ఆధ్వర్యంలో ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహ్ అలేహీవ సల్లాం జన్మదినం సందర్భంగా సుమారు 2000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ముస్లిం సోదర, సోదరీమణులందరికీ "మిలాద్-ఉన్- నబీ" శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ప్రేమ, సోదరభావం, ధర్మ చింతన ప్రతి మానవుడిలో ఉండాలని సూచించిన మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరుకుంటూ సర్వమానవ సమానత్వం, శాంతి స్థాపనే లక్ష్యంగా సాగిన మహ్మద్ ప్రవక్త బోధనలతో స్ఫూర్తి పొందాలన్నారు.



## గద్వాల టౌన్ ఎస్ఐగా కళ్యాణ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం)గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా కళ్యాణ్ కుమార్ ఆదివారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. నాగర్ కర్నూల్ వీఆర్ ఎస్సైగా విధులు నిర్వహించిన రాజు సాధారణ బదిలీల్లో గద్వాల టౌన్ కు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీనివాసులు మహబూబ్ నగర్ జిల్లా కు బదిలీపై వెళ్లారు. నూతన ఎస్సై కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ%శా% శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



## చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

కొత్తకోట, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం) భవన నిర్మాణ, ఇతర కార్మికులు ఈనెల 23న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిల్డింగ్ అధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలిక్సన్ బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కే వెంకటయ్య కోరారు. రాష్ట్రంలో వెల్ఫేర్ బోర్డు స్కీం లను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు అంటూ బోర్డు నిధులు ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టి వారి లాభాలు పెంచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్ల ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీకి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, వెల్ఫేర్ బోర్డు నిధులను పక్కదారి పట్టించిందని భావన నిర్మాణ కార్మికులకు ప్రయోజనం లేకుండా చేసిందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణకు రావాల్సిన 450, కోట్లు బ్యాంకులో ములుగుతున్నాయని చెప్పారు.ప్రస్తుతం శశిధర వచ్చిన 5 వేల 65 కోట్లు రూపాయలు బోర్డులో జమాయవని వాటిని కూడా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిషన్ యూనియన్ అధ్యక్షులు శ్యామ్, సత్తన్న, ప్రకాష్, శ్రీను, నాగరాజు, రాజు,హరీష్,దాసు, తదితరులు పాల్గొన్నారు.



## సరదా కోసం వెళ్లి.. నదిలో చిక్కుకుని..

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం)సరదాగా ఈతకొట్టేందుకు కృష్ణా నదిలోకి వెళ్లిన ముగ్గురు యువకులు, ఆకస్మాత్తుగా వరద నీటిలో చిక్కుకున్న సంఘటన గద్వాల జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. అదే సమయంలో నదిలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు నదిలో చిక్కుకున్న యువకులు గమనించి వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. వివరాలకు వెళ్లితే గద్వాల పట్టణానికి చెందిన చెందిన ముగ్గురు యువకులు ఆదివారం మధ్యాహ్నం గద్వాల మండలం నదీఅగ్రహారం గ్రామంలో గల కృష్ణానదిలోకి వెళ్లారు. కృష్ణానదిలో ఈదుకుంటూ కృష్ణానదీ మధ్యలో ఉన్న నల్లగుట్ట వెళ్లేందుకు ప్రయత్నించారు. నది లోతుగా ఉండటం, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఆయువకులు ఈదలేక పోయారు. దీంతో నది నుంచి ఒడ్డుకు చేరలేక నీటిలోనే చిక్కుకుపోయి కొట్టుకపోయారు. అదే సమయంలో నదీలో వదిలిన చేపల వలలను తీసేందుకు వెళ్లిన మత్స్యకారులు వారిని గమనించారు. మత్స్యకారులు నీటిలో చిక్కుకున్న వారిని బోటు సాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కాగ యువకులు మద్యం సేవించి సరదా కోసం నదీలోకి వెళ్లినట్లు అక్కడున్నవారు ఆరోపించారు. కృష్ణానదీ ఈ ఒడ్డు నుంచి అవతలి ఒడ్డుకు ఈతకొట్టడానికి సరదా కోసం నదిలోకి ఈతకు వెళ్లారని మరికొందరు చర్చించుకుంటున్నారు. నదిలో చిక్కుకున యువకులంతా గద్వాల పట్టణానికి చెందిన వారిగా గుర్తించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## నేడు సబ్సిడీ వంటగ్యాస్ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయనున్న దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

కొత్తకోట, సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మదనాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ పాల్గొని మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు బి.పి.ఆర్ గార్డెన్ లో ప్రభుత్వం చేపట్టిన ఆరు పథకాలలో వంట గ్యాస్ సిలిండర్ ల లబ్ధిదారులకు 500,కే ఇచ్చిన మాట నిలుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అని కార్యకర్తలకు సూచనలు ఇస్తూ సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సిలిండర్ల లబ్ధిదారులకు వంటగ్యాస్ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని కార్యకర్తలు బిపిఆర్ గార్డెన్ లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసే విషయంలో అందరు తగు జాగ్రత్తలు తీసుకొని పత్రాలు అందే విధంగా సహకరించాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

## అన్ని వర్గాల ప్రజలకు తమ సేవలు అందించడంలో రాందేవ్ రావు హాస్పిటల్ ఎల్లప్పుడు ముందుంటుంది

### రాందేవ్ రావు మెడికల్ డైరెక్టర్ కమలాకర్

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం) సమాజంలోని అన్ని వర్గాలకు ప్రజలకు తమ సేవలను అందించడంలో రాందేవ్ రావు హాస్పిటల్ ఎల్లప్పుడు ముందుంటుందని రాందేవ్ రావు మెడికల్ డైరెక్టర్ కమలాకర్ అన్నారు. బాలనగర్ డివిజన్ లోని ఎనిమిది పోలీసు స్టేషన్లలో గల పోలీసు సిబ్బందికి యాన్యువల్ హెల్త్ చెకప్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 6 గంటలకు కూకట్ పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు చేతుల మీదగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అల్లాపూర్, సనత్ నగర్, బాలనగర్, కూకట్ పల్లి, కె.పి.హెచ్.బి, జీడిమెట్ల, బాచుపల్లి, జగద్గిరిగుట్ట స్టేషన్లలోని ఏసిపి క్యాడర్ మొదలుకొని కానిస్టేబుల్స్ వరకు ఉన్న అన్ని విభాగాల వారికి ఈ మెగా వైద్య శిబిరంలో ఉచితంగా అన్ని వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. కంటి పరీక్షలు, బోన్ మినరల్ డెన్సిటీ, బి ఎం ఐ మరియు న్యూట్రిషనల్ అసెస్మెంట్ వంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం పై కూకట్పల్లి ఏసిపి శ్రీనివాసరావు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు రాందేవ్ రావ్ హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ ని శాలువా, పుష్పగుచ్చాలతో సన్మానించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ, సమాజం యొక్క భద్రతకై పోలీసు శాఖ అహర్నిశలు శ్రమిస్తారు, అటువంటి పోలీసు శాఖ ఆరోగ్య భద్రత కోసమై ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. హాస్పిటల్ సీఈవో డాక్టర్ యోబు మాట్లాడుతూ కరోనా సమయంలో పోలీసు శాఖ ఈ సమాజానికి చేసిన సేవ చిరస్మరణీయమనీ, సమాజంలోని ఏ పౌరునికి ఎటువంటి కష్టం వచ్చినా మొదటిగా సంప్రదించేది పోలీస్ శాఖ వారినే అని, సమస్యను పరిష్కరించడంలో ఎన్ని అవాంతరాలు కష్టనష్టాలు ఎదురైనా కూడా సమస్యను పరిష్కరించడమే తమ ధ్యేయంగా పోరాడే అంత గొప్ప పోలీసు శాఖ వారికి ఈ మెగా వైద్య శిబిరం నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేయడం అనేది ఎంతో ఆనందాన్ని కలుగజేసే విషయం అని పేర్కొన్నారు. ఇటువంటి గొప్ప అవకాశాన్ని రాందేవ్ రావ్ హాస్పటల్ కు ఇచ్చినందుకు కూకట్ పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు కీ, బాలానగర్ ఏసిపి హనుమంతరావు కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏసీపీ హనుమంతరావు ఈ మెగా వైద్య శిబిరం పర్యవేక్షించి సమాజానికి ఇంత మంచి ఆరోగ్య సేవలను అందిస్తున్న రాందేవ్ రావు హాస్పిటల్ ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ఇన్స్పెక్టర్ కె. ముత్తు, కెపిహెచ్బి ఇన్స్పెక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, బాచుపల్లి ఇన్స్పెక్టర్ ఉపేందర్ రావు, అల్లాపూర్ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి, జగద్గిరిగుట్ట ఇన్స్పెక్టర్ కే. క్రాంతి కుమార్, జీడిమెట్ల ఇన్స్పెక్టర్ జి.మల్లేష్, బాలానగర్ ఇన్స్పెక్టర్ పి. నవీన్ కుమార్, సనత్ నగర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకు రాందేవ్ హాస్పిటల్లో ప్రారంభమైన ఈ వైద్య శిబిరంలో రాందేవ్ రావ్ హాస్పటల్ కన్సల్టెంట్ డాక్టర్స్, డ్యూటీ డాక్టర్స్, నర్సులు, అడ్మిన్ మేనేజర్స్ అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 6 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా జరిగింది. ఈ మెగా వైద్య శిబిరం రాందేవ్ రావ్ హాస్పిటల్లో నిర్వహించడం ఎంతో ఆనందాన్ని కలుగజేసే విషయమని హాస్పిటల్ యాజమాన్యమైన విక్రమ్ దేవ్ రావ్, మీరా రావు, అపర్ణ రావు, ప్రశాంత్ రెడ్డి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.




## పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

గద్వాల(గట్టు), సెప్టెంబర్ 22(ప్రభాత ఉదయం) గద్వాల జిల్లాలోని గట్టు మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి, భాస్కర్, కృష్ణయ్య, నరసింహులు, నగేష్ బాబు, జాఫర్, చంద్రశేఖర్ శాలువా, మెమోంటోలతో పూర్వ విద్యార్థులు సన్మానించారు. అనంతరం పూర్వవిద్యార్థులందరు కలిసి సుమారు రూ.21 వేలు ఖర్చు చేసి పాఠశాలకు మైక్ సెట్ అందించారు.

## ఉజ్వలభవిష్యత్తుకై అవగాహన సదస్సు నిర్వహించిన నారాయణ విద్యాసంస్థలు

### విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన స్థాయిలో స్థిరపడి సఫలీకృతం కావాలి....
### విద్యార్థులు వేసే ప్రతి అడుగు ఒక్కో మెట్టు పైకి వెళ్లే విధంగా ఉండాలి...
### విద్యార్థిని, విద్యార్థులు విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి....
### నారాయణ స్కూల్స్ సీవో విజయ్ టెక్కి



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 22 (ప్రభాత ఉదయం) విద్యార్థినీ విద్యార్థులు విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడే చదివితే ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నారాయణ స్కూల్స్ విజయ్ టెక్కి అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎలా స్థిరపడాలి అని సతమతమవుతూ, సందిగ్ధంలో జీవిస్తున్న 10వ తరగతి విద్యార్థులకు, కూకట్ పల్లి నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం, కూకట్ పల్లి జోన్ ఏజీఎం వేణు గోపాల్ రావు ఆధ్వర్యంలో ఒక అవగాహన సదస్సును ఆదివారం కెపిహెచ్బి లోని వైష్ణవి గ్రాండ్ లో నిర్వహించారు. ఈ సదస్సు కి విజయ్ టెక్కి ( హెచ్ ఓ డి, నారాయణ స్కూల్స్ సి ఓ) ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్య ప్రణాళిక ఎలా ఉండాలి? 10వ తరగతి తర్వాత ఎలాంటి విద్యను అభ్యసించాలి? ఎక్కువ అవకాశాలు ఏ విభాగంలో ఉంటాయి? ఏది సులభం, ఏది కష్టతరం? జీవితంలో ఎప్పుడు ఉన్నతమైన స్థాయిలో స్థిరపడి, సఫలీకృతం అవ్వగలము అనే అంశాల గురించి చాలా స్పష్టంగా వివరించారు. అనంతరం ఏజీఎం వేణుగోపాల్ మాట్లాడుతూ, "విద్యార్థుల జీవన ప్రగతికి వారి అభిరుచులు తోడైతే జీవితం సుఖమయం" అవుతుందని అన్నారు. "ఉన్నత విలువలతో కూడిన విజ్ఞానవంతమైన సమాజం" కావాలంటే విద్యార్థులు వేసే ప్రతి అడుగు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. తల్లిదండ్రుల విద్యార్థుల సందేహాలకు మరియు ప్రశ్నలకు పాఠశాల ప్రధాన అధ్యాపక బృందం స్పష్టతను, సమాధానాలను అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్ డీన్స్ యు. శ్రీనివాస రావు, సరిత, ప్రిన్సిపల్స్ సుహాసిని, శోభ, విజయ సారథి, రీజినల్ ఇంచార్జ్ లు, ఏ ఓ లు, సాఫ్ట్ స్కిల్స్ బృందం, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.